అణాగ్రంథమాల ప్రచురణము ౧౩.

ఎల్లోరా అజంతా

గ్రంథకర్త:

శ్రీ అడవి బాపిరాజు

ప్రకాశకులు:

అణా గ్రంథమాల

సోల్ డిస్ట్రిబ్యూటర్సు:—

కేశవ పబ్లికేషన్సు అండ్ బుక్‌స్టాల్స్
లిమిటెడ్
జాంబాగు, హైదరాబాదు-దక్కన్.

౧౯౪౧

వెల ౦-౧-౦

అణా గ్రంథమాల

ఆశయములు :-

ఆంధ్రులందు మాతృభాషాభిమానము కలిగించి ఆంధ్రభాషాప్రచారము గావించుటయు, తద్వార ఆంధ్రులందు ప్రపంచజ్ఞానము కలిగించుటయు, ముఖ్యముగా ప్రతిఆంధ్రుడు కొని చదువు అవకాశము కలుగ జేయుటకు సాధ్యమైనంత చౌకగా పుస్తకములను అందజేయుటయు మా ఆశయము.

మహనీయుల జీవితములు, ఆంధ్రుల నిత్యజీవితమునకు సంబంధించిన పుస్తకములు ధార్మిక, సాంఘిక, కర్షక, కార్మిక మరియు రాజకీయ సమస్యలపై అందరికి అర్థమగు భాషలో అతి సులభశైలిలో మీదు మిక్కిలి అందరికి అందుబాటులో నుండునట్లు ప్రచురింపబడును.

నియమములు :-

మా గ్రంథమాలనుండి ౧౦౦ పుస్తకములు ౪ సంవత్సరములలో ప్రచురింపబడును. ప్రతిపుస్తకము సుమారు ౪౦ పుటలువుండును.

మా గ్రంథమాలకు చందాదారులు కాగోరువారు అందుకు లిఖితపూర్వకముగా ఒప్పుకొనవలయును. అట్టివారు సభ్యత్వముక్రింద ౫-౦-౦ చెల్లించవలయును. టపాద్వారా తెప్పించగోరువారు మరి ౨-౦-౦ తపాలవ్యయముక్రింద చెల్లించవలయును. మధ్యనచేరు సభ్యులకు వెలువడిన పుస్తకములు వున్నచో యివ్వబడును.

అప్పుడప్పుడు అనుబంధములు తెలుగు మరి ఇతర భాషలలోకూడా వెలువడును. వాటిని కొనవలయునను ప్రతిబంధకము సభ్యుల కుండదు.

మేము కోరగానే యీ పుస్తకమును దయతో అనుగ్రహించిన శ్రీ అడవి బాపిరాజుగారికిని, బ్లాకులు యిచ్చి తోడ్పడిన కృష్ణా పత్రికాధిపతి గారికి కృతజ్ఞతా వందనము లర్పించుకొనుచున్నాము.

ఇట్లు,

వెల్దుర్తి మాణిక్యరావు
కె. సి. గుప్త
ప్రకాశకులు

అణాగ్రంథమాల కార్యాలయము.
౩౬౯౧, తూర్పుబజారు
హైదరాబాదు దక్కన్.
౧౯౪౧

ఎల్లోరా - ఎజంటా
తీర్థయాత్ర

ఎద్దుబండ్లు తీరేలేదు. చిన్న పిల్లలాడుకొను లాగుడు బండ్లంతకన్న కొంచెముచిన్నవి. లోనమువ్వురు క్రిక్కిరిసి కూర్చుండుటకు జాలిన ప్రదేశమున్నది. అందు మెత్తని పరుపులు, దిండ్లు ఉండనిచో నొడలు నలిగి భారగింపక మానదు. ఎద్దులు పొట్టివి. కొండజాతివి. కొంచెముచిక్కి నట్లుండును గాని మేకలవలె చరచరకొండనెక్కుటకును, నెంతబరువునైన సునాయాసముగ లాగుటకును వెనుదీయవు. బండివాడు కంకరలో బుట్టినవాడన దట్టముగ నెఱ్ఱ దుమ్ము కొట్టుకొనిన మొద్దుపంచయు, చినుగుముళ్ల ఛిన్న చొక్కాయును ధరించి, కొండపీటిచే దాళ్లంతపొడుగైన రెండురంగుల పాత గుడ్డ పీలికలు, గడ్డివామికి మొల్లుచుట్టినట్లుగ తలకుచుట్టు కొనుటజూడ హిరణ్యాక్షునిమించి జగములధరించు ననంతుని దలకు జుట్టుకొన్నాడేమోననిపించును. వచ్చియు రాని యుర్దూభాషతో బండికుదుర్చుకొని ఎల్లోరాకు బయలుదేరితిమి.

బండి, ఎద్దులు, బండివాడు. ప్రకృతి సౌందర్యములో శ్రుతిదోషమియ్యక లీనమైపోయిరి. ఎట్టఎదుట రాష్ట్రకూటులకు, యాదవులను, మహమ్మదీయులకు ముఖ్యదుర్గమై శాత్రవజన దుర్భేద్యమై నేడు పాడుపడినను తొల్లింటిగాంభీర్య

మునేమాత్రము దీసిపోని పురాతన దేవగిరిదుర్గము కాన్పించినది. నగర ప్రాకారము చుట్టునున్న కందకముదాటి సింహద్వార గోపురము వినిర్గమించి, శిధిలములై పడియున్న మహాసౌధావశేషముల గన్గొనుచు నిట్టూర్పులందందు సందడింప కోటముంగిటికి వచ్చితిమి. లగ్గలపై లగ్గలు, బురుజులపై బురుజులు, నచ్చటచ్చట తరములకొలది భూగర్భమున దాగియుండనోర్వమి నెట్టులో బహిర్గతములగుచున్న పురదేవతామందహాసాంకురములవలె నున్నరావి మొక్కలు, నెండిపోయిన యగడ్తలు, సౌభాగ్య విహీనములై బారకీచలవలె హోరుమనుచున్న ధాన్యధనాగారములు, సైనికులులేని హజారములు, సామానులులేని గిడ్డంగులు, గజాశ్వరథములు పో బాటలును హృదయమును తారుమారు జేసినవి.

కుతుబ్ మీనారుతో దులదూగు నల్లాయుద్దీనుని జయస్తంభము నెక్కి నేనును నామిత్రులును విడివడిన కన్నులతో బరిసరముల బరికించి దిగినారము. ఒకచోనొక పురాతన దేవాలయమును, సహస్రస్తంభమంటపమును, మహమ్మదీయులచే మశీదుగ నొనర్పబడినవానిని దిలకించితిమి. తనా బుల చెక్కడపు బనితనము, స్తంభకలశముల పొందిక, పద్మముల మిసిమి, మంటపశాఖల లావణ్యము, లతలసౌకుమార్యము మనస్సు నుఱ్ఱూతలూగించినవి. అన్నిమతములకు భగవంతుడొక్కడేగదా! అంతర్దుర్గము సమీపించితిమి. శత్రువులు బయటి కందకముదాటి ప్రాకారమును లంఘించి, కోట గ్గలలుపట్టుకొని, యగడ్త దాటివచ్చిన, మహారాజు సన్సై

న్యుడై ఈ దుర్గమును చేరెను. ఒక్కటే ఎత్తైనకొండ వరి
కుప్పవలె చెక్కబడియున్నది. చుట్టును నూరు అడుగుల
లోతుగల మహాపరిఖ. అక్కడనుండి నున్నగ మూడువందల
అడుగులు గోడవలెపైకి చెక్కినారు.

దుర్గములోని కొక్కటే వంతెనద్వారము. అక్కడ
నుండి కొండచివరనున్న రాజభవనమునకు గజములుగూడ
బోదగినంత యున్నతమును, రహస్యమును, నంధకార బంధు
రమును నగు మహాబిలమున్నది. కరదీపికల వెల్గున గజ
యూధములు, కాల్బలములు పైకిచేరును. శత్రువు ఎంతబల
వంతుడైనను పరాక్రమముచే నీకోటపట్టజాలడు. ఆహార
పానీయములు దొరకకుండ అనేక సంవత్సరములు ముట్టడి
వేసి యోడించవలెను. కొండపై జలస్రవణములు చాల
యున్నవి. కందకముకడకు దారియున్నది. అచ్చటినుండి
యొక రహస్యమార్గ మెల్లోరాకొండల కావలవరకును నున్న
దట. చాల బరువగునొక ఫిరంగి చిట్టచివరనున్న రాజసౌధో
పరిభాగంబునకు దానినెట్లు గొనిపోయినారో! ఆఫిరంగి అనేక
క్రోశముల దూరముననున్న శత్రువులనుజూచి చెండాడునట.

౨

దౌలతాబాదున (దేవగిరి) కావల బండ్లు కొండ
నెక్కినవి. రెండుకొండలనడుమ నొక జలపాతమున కాన
గట్టకట్టి, పూర్వభూపాలుడు దేవగిరియగడ్తలకు నీరును, నా
ప్రదేశమున వ్యవసాయమునకు గావలసిన జలమును నిమ్మ
డిగ నందజేసిరి. యింతలో నొక గ్రామము జేరితిమి.

నేను:- ఓగామ్ కా నామ్ క్యా?

బండీవాడు:- కాగజ్ పూర్.

నేను:- కాగజ్ ఉదర్ తయార్ హైక్యా?

బండీవాడు:- జీ.

నేను:- అజీ?

బండీవాడు:- జీ.

మేమందరము న గ్రామములోనికిపోయితిమి. అచ్చటి వారు కొండపల్లి కాగతములవంటి కాగితములు సేయుచుండిరి. అమెరికాలో "హర్టు" అను నాయన ముప్పదిరెండు పత్రికల కధికారియట. ఒక్కొక్కదిన పత్రికకు చందాదారులు కొన్ని లక్షలమంది. అనేకవిధముల దేశముల నెల్లెడ దినమున కనేక కోట్లపుట్ల కాగితములను యంత్రములు సేయుచుండ నొకమారుమూలనీకుగ్రామమునగొన్ని బీదకుటుంబములకీ కాగితవు జీత జీవనాధారమైయున్నది గదా!

బండ్లు ఖులదాబాదును సమీపించినవి. కోటగుమ్మ ముదాటి యూరిలోనికి దిగితిమి. కొంతదూరము జనునప్ప టికి బండివాడు ప్రక్కనొక మసీదునుజూపి, "పాదుషాకా గోరి" యనెను. ఔరంగాబాదు ప్రక్కనొక యూరిలో ఔరంగజేబు చక్రవర్తి సమాధియున్నదని యెఱిగినవాడ నగుట "అలంఘీర్ పాదుషాకా" అని యడిగితిని. "హాఁ" యనుజవాబునంది లోన ప్రవేశించితిని. "రోజా" యను గురువు యొక్క మసోలియముప్రక్క నౌరంగజేబు తనదేహ మునకు శాంతినొసగగోరెను. గురువుయొక్క సమాధి వెండి

తలుపుల గుమ్మాలు, గులోబులు, పాదరసపుబుడ్లు, బంగారు శిఖరము, పుష్పములు, వివిధములగు నాణెములు, పట్టుచాందినీలు, ముఖమల్వస్త్రముల కప్పులు,—భోగియైన నొక మహారాజు విలాసమందిరమువలెనున్నది. కాని రాజపుత్రులకు పులియై మహారాష్ట్రులకు బల్లెమై, ఆఫ్గనులకు భూతమై మహమ్మదీయ సామంతులకు సింహమై, మొగలులలో అత్యంత విశాలరాజ్యమునకు సార్వభౌముడై దుర్యోధనుని వలె నుత్కృష్ట వైభవము నపేక్షించిన యీచక్రవర్తికిసన్యాసుల సమాధివలె నీగోరీయేమి! ఆకాశమే చాందినీ, ఒక రావిమొక్క చామరము, సన్నని పాలరాతిగోడ యావరణము. అక్బరుషా జహానులకున్న వైభవము ఔరంగజేబుకున్న వైరాగ్యము, వారి సమస్త మతసమత్వదృష్టి, వీని మహమ్మదీయమతదీక్ష—అసాధారణములగు నలంగీర్ గుణగణముల నర్థము చేసికొనుట కష్టము.

రోజాదాటి దడవడ కొండదిగగ యెల్లోరా కైలాస గుహా దేవాలయమున కెట్ట యెదుటనుంటిమి.

3

రాష్ట్రకూటాధిపతియగు కృష్ణరాజునకు తగని జబ్బు సంభవించినది. ఘనవైద్యులు, భక్తులు, యోగులు, నెవ్వారు నావ్యాధి కుదుర్పలేకపోయిరి. ఒకపల్లెటూరి బ్రాహ్మణుడు రాజదర్శనము జేసి " ఓరాజా! భక్తాగ్రగణ్యులు, శివపూజా ధురంధరులు నగుదేవరకు భక్తిపక్షపాతియైన భగవంతుడొక

తెరువుజూపకుండునే! ఈ దాపుననే మీగ్రామమగు "నెరోలా" సమీపమున కొండలో నల్లరాతిలో జలము గన్పించినది. ప్రభూ! ఆయూట నీరుగ్రోలిన నది యేమి మాహాత్మ్యమోగాని యెట్టి భయంకరవ్యాధియైన మాయమగుచున్నది. కాని మహారాజు లాప్రదేశమునకు బోయి యాపుణ్యతీర్థము గ్రహింప ప్రార్థితులనెను. దేవతలరీతి తేజమున నొప్పు నాభూదేవుని పలుకులు చెవులకమృతపు జినుకులైతోచ, నీటమునిగిపోవు నాతడు గడ్డిపోచబట్టురీతి రాజాతక్షణమే "నెరోలా" గ్రామమునకు బయనమై యాజలబిలముకడ శిబిరమేర్పరచి యాతీర్థము గ్రహించనారంభించెను. గడ్డిపోచ తెప్పయైనది. ఆమహారాజు వ్యాధిమట మాయమైపోయెను.

కులదైవతమగు శంకరున కామహా గుహాలయము నిర్మింప సంకల్పించెను. మేటిపనివాండ్రను, ముక్కాకలు దీరిన శిల్పులను దేశదేశములనుండి రావించెను. కైలాసాధినాథునకు కైలాసాలయమే యుద్భవమందవలెను. విశ్వకర్మలకెల్ల సార్వభౌముడగు నొక మహాసత్త్వుడు హిమాలయపర్వత శ్రేణి నధిగమించి మానస సరోవర రావణహ్రదయముల దాటి పవిత్రశైలమగు నాకైలాసమును సందర్శించి వచ్చి యారూపున నీగుహాలయమును దివ్యతేజోవికాసము నందజేసెను.

అర్థచంద్రాకృతి నున్నకొండ పొడవునను రెండు మైళ్లవరకు నెల్లోరా గుహాలున్నవి. ఆర్య మతోద్భవములై

పవిత్ర వేదార్థముల వివిధరూపముల గ్రహించి, విజృంభించి, వేనవేలు విధానముల భారతీయ మతదీక్షల బ్రవర్తింప జేసిన బ్రాహ్మణ బౌద్ధ జైన మతములు మూడును నెల్లోరా గుహాలలో సాక్షాత్కరించి యున్నవి. ముప్పదినాల్గు గుహాలలో నెడమనైపున చిట్టచివరి నాల్గును జైనారామములు. కుడి నైపున చివరి పదమూడు చైత్యములును విహారములును బౌద్ధులవి. తక్కినవి, మధ్యనుండిన యవి బ్రాహ్మణ గుహాలు.

మా స్నేహితులలో వాద మొక్కటి బయలుదేరినది. ఒకరు ముందు కైలాసమునుజూచి తరువాత నితరగుహాల జూడగోరిరి. అటులనా "ఆర్కియాలజీ డిపార్టుమెంటువారు (పురాతన శిల్పపరిశోధన సంఘమువారు-ఆసారెఖదీమా) వేసిన యంకెలపత్రికారము మొదటనుండియు జూడవలె" నన్నారింకొకరు. కొంతవరకు వాద ప్రతివాదములు జరిగిన వెనుక మొదటనుండి గుహాల విలోకింపబ్రారంభించితిమి.

ర

ఎల్లోరాలోని హిందూగుహాల శిల్పచాతుర్య మత్యద్భుతము, వర్ణనాతీతము. భారతశిల్పవైభవము ననేకయుగములుగా విభాగింపవచ్చును. ప్రాచీనార్య శిల్పము, గాంధార పద్ధతి, పూర్వబౌద్ధ విధానము, రెండవబౌద్ధయుగ శిల్ప ప్రాబల్యము, పశ్చిమచాతుర్య చమత్కృతి, పూర్వజైనశిల్ప సాంప్రదాయము, పల్లవయుగపు చెక్కడపుఁ బెక్కు, ఎల్లోరా ప్రభావము, ఓఢ్రశిల్ప వికాసము, దక్షిణ ద్రావిడశిల్ప

వైచిత్ర్యము, ఉత్తరహైందవ విజృంభణము, నేపాళదేశ కల్పనాశక్తి, జావాబౌద్ధుల యశస్సు, కాంబోడియా, జావాలహైందవ రచనానైపుణి, సింహళద్వీపపు చెక్కడము, దక్షిణజైన శిల్పవిజృంభణము.

ప్రాచీనార్యశిల్ప సాంప్రదాయమున విగ్రహముల గాంభీర్యము, భావౌన్నత్యము, మనకు దొరికిన రెండు విగ్రహములలోననే యుద్దీపిత మగుచున్నది. 'యక్షిణి'యను విగ్రహమును, నొకమహారాజు విగ్రహమును మాత్రమే దొరికినవి. గాంధారపద్ధతి యవనసాంప్రదాయ సౌకర్యము. అందేమియు నౌత్కృష్ట్యము గాన్పింపదు. అశోకచక్రవర్తి కాలమునుండి, భారతశిల్పము మహోదార పథమ్ముల బెరిగి పోయినది. సాచీ స్థూపము నాల్గుసింహద్వారముల పైనున్న చెక్కడపుపని, భారతీయశిల్పుల మేటి కల్పనాశక్తి వెల్లడించుచున్నది. అమరావతి, సారనాథము మొదలగు శిల్పతీర్థములలో నీసంవిధాన మత్యున్నత దశనంది మహాయశము గడించినది. రెడవబౌద్ధయుగపు శిల్పవైఖరి అజంతా కార్లే నాశిక, ఎల్లోరాలలోని గుహాదులలో విజృంభించినది. స్తంభముల పైని శిల్పచమత్కృతి మిక్కుటమచ్చట. వాతాపినగరమున పశ్చిమ చాళుక్యుల శిల్పరచన యల్లుకొని పోయిన పూదీవయైనది. మహాబలిపురమున పల్లవరాజ్య శిల్పవిధానము, సప్తరథములుగా నొక్కొక రాతినిచెక్కిన మందిరములై, పూర్వార్యసంప్రదాయమున కనేకవిధముల మెఱుగు వెట్టి మహోద్రిక్తమై వెలింగినది. రాణి గుంఫా మొదలగు

౧

అణా గ్రంథమాల.



ఎల్లోరా-అజంతా లోని దృశ్యములు.

ఎల్లోరా-అజంతా లోని దృశ్యములు.

గుహాలలో పూర్వజైన సంప్రదాయము చిగిరించినది. ఓఢ్ర శిల్పము, కోనారకు, భువనేశ్వర, జగన్నాథక్షేత్రములందు లలితపదముల. తెలుగు పాటవలె ముద్దుగులుకు బొమ్మల మురుపుజూపినది. దక్షిణ ద్రవిడశిల్ప పద్ధతి శబ్దశాస్త్ర సుపరిష్కృతమై తేజోవంతమగు నుత్తమ శ్లోకమువంటిది. ఈ శిల్పవిలాసము, భావపరిణతియందును, రూపరేఖా విలాసము నందున వన్నె కెక్కినది. వంగ, విహార, ఘూర్జర దేశముల యుత్తర హైందవ చమత్కృతి కొంచ మెచ్చుతగ్గుగా దక్షిణ ద్రావిడ సంప్రదాయము ననుకరించినది. నేపాళ దేశమున హైందవ శిల్పరచన విచిత్ర మార్గముల ద్రొక్కి యొక నూతన స్కంధము నుపక్రమించి హిమవన్నగ శైవాలినీ గానముల బాడుచున్నది. జావాలో బౌద్ధశిల్ప సంప్రదాయ మమరావతీ సారనాథముల యశస్సునకు వెనుకబడక తుల్యమై యుత్కృష్టత గాంచినది. కాంబాడియా జావాల లోని బ్రాహ్మణ సంప్రదాయమును, సింహళమునందలి బౌద్ధ శిల్ప విధానమును వివిధముఖముల బ్రఖ్యాతిగూర్చి మాతృ సంప్రదాయములకు వన్నెగూర్చి విరాజిల్లినవి.

ఎల్లోరాలో హైందవ గుహలందు ప్రత్యేకమగు శిల్పరచనా చమత్కృతి శీతనగ మహాశిఖరమగు గౌరీశంకర సాదృశ్యమునందినది. ప్రసిద్ధ గ్రీకు శిల్పులైన పైథాసు, ప్రాగ్జిలిటీసు, మొదలగువారు, కళావైభవమును దేహసౌందర్యమున జాటి యశముగాంచిరే కాని యాధిభౌతికమగు వారి ముక్తివాంఛ భారతీయ శిల్పాశయమగు నాధ్యాత్మికానంద పథముల దఱచి చూడలేదు. అట్లని భగవత్ప్రతి రూపము

నాదగు మానవమూర్తినే భారతీయ శిల్ప విధానము ద్రోసివేయలేదు. ప్రాచ్యశిల్ప సంప్రదాయములలోనికెల్ల 'ఎల్లోరా' గణ్యత గాంచినది.

౫

గంభీరకళా రూపమొందునది ప్రాపంచికమైన మానవదేహముకాదు. ఆఱడుగులకు మించిన పొడగరులై రాతిదిమ్మలవలె నవయవ సౌష్ఠవము గలిగిన రష్యనులు, జర్మనులు మొదలగు పాశ్చాత్యులు పూర్వకాలమునందు కళలలో మహౌన్నత్యము నేమియు జూపించలేదు. దక్షిణ భూభాగముల నూష్ణప్రదేశములనుండిన ఈజిప్టువారు, పిరమిడ్సును కట్టినారు. భారతీయు లున్నతదేవాలయములను నిర్మించినారు. ఆకళాగాంభీర్యమే దక్షిణ హిందూదేశమున మహా పర్వతముల దొలిచిన దేవాలయములుగను, గగనరహస్యములు పలుకు గోపురములుగను నుద్భవమొందినది. మహాబలిపురమున ననేకశిలా వినిర్మితములైన మహారథములు, ఎల్లోరాలో కొండతొలచ జగన్మోహనముగ మలచబడిన కైలాసదేవాలయము, నున్నత ప్రమాణమున మించు జైన విగ్రహములు, ఎల్ఫాంటా త్రిమూర్తి విగ్రహము, చిదంబర మధురానగరములలోని దేవాలయ గోపురములు, భువనేశ్వర జగన్నాథ దేవాలయముల విమానములు నీభావమున రూపొందినవే.

వివిధ దేశములనుండి సముద్రముల కావలి విలాతుల నుండి వేనకువేలు యాత్రికులరావించు కైలాసదేవాలయమే ఎల్లోరా గుహలలోనికెల్ల ముఖ్యమైనది. ఇది పదునారవ

గుహ. ఎల్లోరాకొండ మన వైపువానివలె కంకరపోతపుగాదు. పర్వతమంతయు నేకశిలారూపము. అట్టికొండకొకప్రక్క, ముందు గోపురపు కుడ్యములు, మందిరము, కుడ్యములపై బురుజుదారులునుంచి, చుట్టును ముప్పదియడుగుల తొలుపుడు గోడలకును, దేవళమునకును స్థలముంచి సుమారరువది యడుగుల వెడల్పు, రెండువందల యడుగులపొడవు, నూట యిరువది యడుగులయెత్తునను కైలాస దేవాలయమును దొలిచినారు. చుట్టును గొండతొలువుడు. గోడలో రెండు మూడంతస్థులుండునట్లు యాత్రికు లుండుటకు మందిరములు చెక్కినారు. ఆమందిరములు దివ్యమందిరములే. అందు స్తంభ ములపనితన మద్భుతావహమై యుండును. పీఠికపైకుంభము, ఆకుంభ కలశమునుండి ముద్వాలికిపారు లతలు పుష్పములతో విజృంభించి పైకివచ్చుచున్నవి. గోడలపై శివలీలలు, విష్ణు లీలలు, మనోహర శిల్ప చమత్కృతి వెలిగిపోవుచున్నది. ముందు చెక్కబడిన చిన్నగోడపై నందవు బ్రోవులోయన స్త్రీపురుష విగ్రహములు మిసిమిదేలుచున్నవి.

ఏనుగులు, ఏనుగులపై దుముకుసింగములు, సింగ ముల నెన్నుల నొడిసి పట్టుకొను శరభములు, శరభముల వెన్నంటుసాళ్వములు, వీనియన్నింటిపై ముఖ్యదేవాళయము నిలిచియున్నట్లు చెక్కినారు. దేవాలయమొక యంతస్థుపై నున్నటు లమరింపబడినది. దానికెదట కళ్యాణమంటపము, కళ్యాణమంటపమున, కెదురుగ గోపురమంటపము అన్నియు గలసియే యున్నవి. ప్రధానదేవాలయము చుట్టును విఘ్నే శ్వరుడు,హిమాలయ తనయ క్షేత్రపాలకుటగు నారాయణుడు,

కుమారస్వామి మొదలగు దేవతలు చిన్నచిన్న గుళ్లలో విడిసి యున్నారు.

దేవాలయమునకు ముందు కుడి ఎడమ రెండు ధ్వజ స్తంభములున్నవి. దేవాలయము, మంటపము, గజములు, ధ్వజస్తంభములు గోపురములు, యాత్రికమందిరములు, వీని యన్నిటిపై జెక్కిన లతలు మందిరస్తంభములు, ముందున్న ప్రాకారకుడ్యము, అన్నియు నొక్కటే శిల. ఈదేవాళమున బ్రతిష్ఠింపబడిన కైలాసేశ్వర స్వామి యారాతిలోని లింగమే. అచ్చటచ్చట విగ్రహములు గోడలోనికి చెక్కబడియుండక, గోడ కతికినట్లుగ నాశిలలోనే చెక్కినారు. దేవాలయము సుమారు నూట యిరువది అడుగలఎత్తున్నది. ఇంత మహా ద్భుత శిల్పమూర్తి నేకశిలనుండి చెక్కినారన్న మహాప్రతిష్ఠ గారీశంకరమునకేది? ఎయ్యెడ జూచినను శిల్పప్రావీణ్యము, కళావైదగ్ధ్యము, గల్పనాశక్తి, విచిత్రినైపుణ్యము నొక్క- మాఱుగ సాక్షాత్కరించి, వర్ణనాతీతమై యానంద వాయు డోలికల నూగించి శిల్పాధి దేవత, శారదామూర్తి పీఠిక మోశులకు గళోపాసకు నవతరింపజేయును.

కైలాసగుహామందిర ప్రాంగణముననే రాష్ట్రకూటు డగు కృష్ణరాజు వ్యాధినిర్మూల మొనరింప జాలిన పవిత్రతీర్థ ముల గలిగిన యారాతినూయి కుడివైపుననున్నది. ఇప్పటికి నందలి జలములు స్వచ్ఛశీతలములై తియ్యందనాల తైర్థికుల తృష్ణబాపుచున్నది. ఎట్టఎదుట గుహాకుడ్యముపై మహోన్న తరూపములతో; గంభీర భంగిమములతో హంసవరాహా పాఖ్యానము, ప్రళయభైరవ సంహారవిలసనము, సంధ్యా

నృత్యము మొదలగు శివలీలలు; నరసింహ విజృంభణము, వరాహావతారము మొదలగు విష్ణుగాథలును పులకరాలు గలుగజేయునట్లు చెక్కినారు.

లోనికడుగిడుట తోడనే మందిరకుడ్యముపై గజలక్ష్మి సాక్షాత్కరించును. ధర్మార్థ కామ మోక్షములు గజములై క్షీరవర్షములు గురియ పద్మాసనాసీనయై పద్మషండము హంసలు, బకములు, మత్స్యములు పరివేష్టింప నభయవితర్క ముద్రాంకితయై, దివ్యసౌందర్యమూర్తియై యాదేవియచ్చటనే శతాబ్దములు నివసించియున్నది. కుడివైపున మాయాసంహార లీలామూర్తియగు మహిషాసుర మర్దనియవతరించి యున్నది. ఎడమవైపున డుంఠి వినాయకుడు విఘ్నముల నశింపజేసి భక్తుల బ్రోవ దీర్చియున్నాడు.

మనము ప్రదక్షిణము చేయుదము. రతీమన్మథుల దర్శింతము. త్రివేణీసంగమున నాత్మైక్యము గావించుకొందము. గంగాదేవి మకరవాహనయై త్రిభంగి మూర్తియై విలాసరూపమున నిలచియుండ, నామె కుడిప్రక్క పద్మవాహనయగు సరస్వతీ ధునీమతల్లియు, నెడమవైపున కూర్మవాహనయగు యమునా స్రవంతియు మూర్తీభవించి యున్నారు. కళాలాదిత్యమిచ్చట నొరసికొని పోవుచున్నది. నిర్మల నీరముల వెలుగు, స్వచ్ఛకమల పత్రవితానము మముజుట్టివేసి తన్మయుల జేసినది.

ప్రాకార ప్రదక్షిణము సేయుచు నెడమవైపునకు వచ్చిన తోడనే గుడికి క్రింది భాగమున నొక మహాచిత్రము గోచరించినది. ఎల్లోరా గుహలలోని కెల్ల నయ్యది యత్యంత

రమణీయమై కళావికాసము గుప్పిమ్మరింప జేయుచున్నది కైలాస దేవాలయ నిర్మాణము గావించిన యామహాశిల్పియే దీనిని సృజించి యుండవచ్చును.

ఆచిత్రమూర్తి యిరువది యడుగులయెత్తున్నది. పది యడుగుల వెడల్పు.

ఇరువది చేతులు నిరువది వైపులకుబోనిచ్చి, కొన్నిట భూమి నానుకొని, కొన్నింటితో కైలాసము భరింపుచు, తన్నదిమి వేయకుండ జూచుకొనుచు పక్కలగొన్ని హస్తముల నూతగొని, పట్టినపీఠముద్రభగ్నముగా, నడగిపోయెడి యహంకారము, కార్యకారి కానిలోపము, అసూయ, భయము, నన్నియు ముప్పిరిగొన, వికృతములై పోయిన మోము లన్నిదెసలకుద్రిప్పి రావణుడు కైలాసపర్వతము క్రిందగనబడినాడు. వానిపై నామహాపర్వతమున్నది. భూకంపము గలిగినప్పుడు భయపడువారివలె నబలలగు నప్సరసలు పారిపోవుచున్నారు. మనోహరమూర్తియై దివ్యలీలా విలాసియై యీకంపమేమియని కొలదిగకలతజెంది, ప్రాణనాథుని హస్తము పట్టుకొను గిరికుమారియు, నిశ్చలుడై యవ్యక్తమందహాసమున నొకచేత నప్సరసల భయమును వారింపుచు జగన్మోహనాకారమున చిన్ముద్ర విడవకయే తన యరాంగి భయముదీర్చుచు కుడికాలిబొటన వ్రేలింతమాత్రము నొక్క, రావణుడు క్రిక్కిరిసికొని, నలిగి కైలాసాధోబిలమునబిగిసి పోజేయు చంద్రశేఖరుడును దృగ్గోచరులుగా, నాశిల్పకల్పన ప్రపంచాద్భుతమని యట్టె నిలువబడి పోతిమి. ఎన్నియామము లామహోదార శిల్పవిన్యాసము దిలకించియుంటిమో!

రేఖా సౌకుమార్యము, నవయవ గాంభీర్యము, భంగి మశుద్ధి, శిల్పచాతుర్యము నొండొంటి నొరసికొనిపోవ హిరణ్యాకశిపుతో నరసింహుడు పెనగులాడు చిత్రములు, వాలి సుగ్రీవ సమరము, గంగావతరణము, భారతయుద్ధము, ఆకాశచారులగు గంధర్వకిన్నరులు, విమానారూఢులగు దేవతలు, చంద్రశేఖరుడు, భైరవమూర్తి, గౌరీశంకరులు మొదలగు విగ్రహములెన్నియేని యీ దేవాలయమునం దున్నవి. ప్రదక్షిణముపూర్తియగు నప్పటికి, భూమిరథము, మేరువుధనస్సు, వాసుకితాడు, బ్రహ్మయనూరుడు, వేదము లశ్వములుగా త్రిపురాసుర సంహారోన్ముఖుడైన శివసూర్యుని దర్శించెదము.

౬

హిందూ గుహాలలో పదునాఱవది యుత్తమము. రెండంతస్థుల గుహ. పై అంతస్థు మిక్కిలి విశాలమగు సభాకృతిగ దొలిచినారు. ఎడమవైపున అన్నియు శివలీలలు, భైరవుడు, నటేశ్వరుడు, పార్వతీవివాహము, మార్కండేయ సంరక్షణము మున్నగునద్భుత శిల్పములున్నవి. కుడివైపున నృసింహ, వరాహ, త్రివిక్రమ, రామాది నారాయణావతారములున్నవి. ఈ విగ్రహములన్నియు భూమ్యాకాశములు నిండియున్నట్లు తోచు నౌన్నత్యముగలవి. బ్రాహ్మణగుహాలలోని విగ్రహములను, రూపసౌందర్యము నేమాత్రమునిరసింపక, కేవలము రేఖావిన్యాసముననే చూడక, సర్వాకళాంగములు పెనవేసికొనిపోవు కల్పద్రుమములవలె చెక్కినారు.

బౌద్ధ గుహాలలో స్తంభములయందము పెక్క గమనించవలసిన యిత్యద్భుతము లేమియు లేవు. ఇరువదియెనిమిది,


తొమ్మిది, ముప్పది సంఖ్యలుగల గుహలు మొదటి పదునైదు గుహలవలె విశాలములై కొన్ని కొన్ని క్రొత్తవింతలు గలిగియున్నవి.

ఈ గుహలెల్లోరా కొండలలోనున్న పెద్దజలపతనమున కావలనున్నవి. ఆజలపతనమునకు దారిగ కొన్నిమెట్లు గలవు. ఆమెట్ల వరుసగాయుచు రెండుమహాసింహములున్నతములై యశోకుకొని సింహముల కేమాత్రము దగ్గిపోనివున్నవి. ఇందలియొక గుహలోననే వివాహ మంటపమున్నది.


ముప్పదియొకటి మొదలు నాలుగువరకును జైన గుహలు. జైనులొకచిన్న కైలాసము నొకటి ఇచ్చటనిర్మించి దానిక్రింద సభయని పేరిడిరి. ముప్పదియడులఎత్తుగల దేవాలయమొకటి యచ్చముగ కైలాసమువలెనున్నది. కైలాస గుహయందువలె నచ్చటను రెండేన్గులున్నవి. బ్రాహ్మణ గుహచిత్రములలోని సౌందర్య మిచ్చట గానరాకున్నను నివియు అద్భుత కళామూర్తులే. ఇంద్రుడు, శచి, తీర్థంకరులు వటవృక్షము, చూతవృక్షము మొదలగునవి యత్యంతమనోహరముగ ధారణమొనర్చినారు.

౭

నాల్గుదినములైనది. విడువలేక విడువలేక ఆసాయం కాలము అజంతాకు బయనమైతిమి. కొండవెనుక భానుబింబము సంధ్యాకిరణములతో, పంచవన్నెలతో దిగిపోయినది. చుట్టుదారిని బోదలంచి నెమ్మదిగా కైలాసగుహముందునుండి తిన్నగా గ్రామములోనికి బోవనారంభించితిమి. గుహకు రెండు వైపులను రెండుజలపతనములున్నవి. నీటితుంపరలలో ఆకాశ



ఎల్లోరా-అజంతా లోని దృశ్యములు.



ఎల్లోరా-అజంతా లోని దృశ్యములు.

వర్ణము ప్రతిబింబించి మా హృదయముల దుఃఖము కొంచెము చల్లార్చినది. ఎడమవైపు జలపతనము మధ్య కొండగోడలో నొక చక్కని చిన్న గుహాయున్నది.

చీకట్లెల్లెడల నాక్రమించినవి. వెనుకకు జూచుచునే మార్గముతో మేమునుక్రిందికి దిగుచుంటిమి. పట్టలేక యొక్క సారి వెనుకకు తిరిగిచూచితిని. సంధ్యాధూళియంతటను నావరించియున్నది. ఆ ధూళిలో నవ్యక్తమగుచు సన్నని మొగిళ్ల పొదమాటుననుండి సర్వవర్ణ ముగ్ధమైయున్న చంద్రవంకరీతి నున్న ఎల్లోరా గుహలు మహాపథముల వెనుక మినుకులాడు ఊర్ధ్వలోకమువలె గన్పించినది. కైలాస దేవాలయ మున్నతమై స్నిగ్ధ స్వచ్ఛకాంతల దివ్యమండలములలో లీనమైపోయినది. అడవి పొగడపువ్వులు సువాసనలలో, పక్షుల గానములలో, దిక్పతులు చీకట్లలో విలీనములైపోవ నే నొక్కడ నవ్యక్తరూపమున నెట్టఎదుట గన్పట్టు ఎల్లోరా కొండముంగిట, కన్పడని కైలాసగుహాభ్యంతరమున కళోపాసకుడనై నిలిచియుంటిని.

౨

అజంత—చిత్రకారులకు పవిత్ర యాత్రాక్షేత్రము. జపాను, చీనా, బర్మా మొదలగు ప్రాచ్యదేశములనుండియు, ఇంగ్లండు, జర్మనీ, ఫ్రాన్సు, అమెరికా మొదలగు పాశ్చాత్య దేశములనుండియు అనేకులీ పుణ్యస్థలము దర్శించుటకు నేటేట వచ్చుచుందురు. హైదరాబాదు నైజాముగారి యదృష్టముచే శిల్పస్థానముల ప్రఖ్యాతిగాంచిన యెల్లోరాయును, చిత్రములకు పేరొందిన అజంతాయును వారి సంస్థాన

ముననే యున్నవి. దౌలతాబాదునుండి రైలెక్కి మన్మాడు పోయి బొంబాయి ఢిల్లీ యినుపదారిపై పయనమై పచోరా, లో దిగి అచ్చటినుండి చిన్నయయోమార్గమున 'పాహూరు' గ్రామమును జేరినాము. మఱల బండ్లు మధ్యాహ్నము బయలుదేఱి నెమ్మదిగ సాయంత్రమునకు పదిమైళ్ల దూరములోనున్న ఫైజాబాదులో నవాబుగారి బంగాళాలకు జేరినాము.

దారిలో రెండుమూడు మహారాష్ట్ర గ్రామముల దాటితిమి. మహారాష్ట్ర గ్రామములు చిత్రములై చిత్రకారుని హృదయమునకు సంతోషము గొల్పుచుండును. ఈవలావల సాధారణముగా నగడ్తవలె రెండుమూడు సెలయేళ్లు ప్రవహించు స్థలములందే వారి గ్రామములు మొలకలెత్తును. గ్రామము చుట్టును తోట వీథులన్నియు ఎత్తు పల్లములుగా వంకరటింకరగా నుండును. వీధి వీధికి పెద్ద ద్వారములు, బురుజులు, ప్రతిగృహము నొక చిన్నకోటయే. దొడ్లులేవు. లోగిట్లో ముందు చావడియుం దొకబావి. కొండ వీటి నూతులకవి పెద్దన్నలు. రాలు పరచిన వీథులను, పాడుపడి మొక్కల బయలుదేరు గోడలను, రంగురంగుల ప్రాతగుడ్డల ధరించి వీథుల దిరుగు జనములను జూచి పూర్వకాలపు మహారాష్ట్ర గాధ యొకటి నాయెదుట ప్రదర్శింపబడుచున్నదని భ్రమనొందితిని.

ఫైజాబాదు బంగాళాలకు అజంతా గుహాలు నాలుగు మైళ్లున్నవి. పూర్వము కాలిబాటయేకాని బండ్లత్రోవ లేదు. ఇప్పుడు మోటారుదార్లుగూడ గుహాలకడకు బోవుచున్నవి.

అజంతా పర్వతపంక్తిలో నొకచోట భోగిరాధునీమ తల్లి జనించి, కొండలపై వచ్చి వచ్చి ఒక సన్నని లోయలో చిన్న మనోహరమైన పతనముగాపడి ఆలోయ ననేకయుగ ములనుండి మూడునాల్గు వందల యడుగుల లోతుకు నాల్గు మైళ్లవరకు గోసి వంకరటింకరల మార్గము జేసికొని పరిసర ప్రాంతముల ఫలవంతముగా జేయుచు ప్రవహించి గౌతమా నదిలో ముక్తినొందు పూర్ణాసరివంతిని కలియుచున్నదట. భోగీరా లోయలో కమలాఫలము, బొప్పాయి, ఖర్జూర, అరటి మొదలగు ఫలములు, సమస్త శాకములు, ధాన్యములు మిక్కిలి ఫలవంతముగా పండింపబడుచున్నవి.

౯

ఉదయమున కాకులు కూయకపూర్వమున లేచి వంటలు చేసికొని గుహలకై బయలుదేరినాము. మూడు సెల యేళ్లు కర్రల సహాయమున నొకరినొకరు పట్టుకొని దాటి నాము. యుగములనాటి పాటలే పాడుకొనుచు మాకా నిర్జర సుందరులు నెదురుకొలిచ్చినారు. అడవిపుష్పములు, సేఫా లికా కుసుమములు మాపై వర్షము కురియ భోగీరా లోయ ప్రవేశించినాము. శబరకన్యల శంఖారావముల, వేణువన స్వనముల, జలధితరంగా లాపముల లీనముజేసికొని వివిధ గానముల దన్మయురాలై రాల బ్రవహించు భోగీరానది ఆ లోయలో నీవలావలకు మూడు పర్యాయములు నిర్గ మించితిమి. ఎత్తైన నున్నని గోడలవలె కొండచరియలు. ఎచ్చటనో కన్పించుచున్నది నిశ్చలనీలాకాశము. ఎప్పటి కప్పుడు యింతటినుండి దారిలేదని భ్రమ. చుట్టును పర్వత

సానువులే. అవేలవే గుహాలని తన్మయత్వము. ఇంకను మెలికలు పద్మవ్యూహము జొచ్చు అర్జునాభిమన్యులుగాని యితర యోధులకుకూడ నైన మఱవులు. ఇంక నొక్క వంకర అదిగో! గుహాపంక్తి.

శతధనుః పరిణామము గల్గిన లోయలో నూరడుగుల దిగువనది. నూరడుగుల పైన నచల శిఖరములు. సంపూర్ణార్ధ చంద్రాకృతి నున్న పర్వత స్నిగ్ధ సానుకుడ్యమున విహారములుగ, చైతన్యములుగ వివిధ మనోహర రూపముల సుందర స్థంభములతో నజంతాగుహ లొక్కసారి సాక్షాత్కరింప చ నములేని విగ్రహములవలె మేమట్లనే నిలిచిపోయినాము.

౧౦

పూర్వుల హస్తస్పర్శ బవిత్రములైన సోపాన పంక్తి నెక్కి గుహాల జేరితిమి. ఈ మెట్ల వరుస గుహాలకు మధ్య నున్నది. ఇచ్చటనే కొలది దూరమున నందమగు నొక జలపతనము క్రిందివాగులోనికి పడుచున్నది. సాయంతనమగునప్పటికి గుహాలను సంపూర్ణముగ తిలకించినారము. కాని ఎన్ని సారులు చూచినను తృప్తిమాత్రము ఎట్లు కలుగును? అజంతా గుహాలలో శిల్పచాతుర్యము చాల తక్కువ. స్థంభములు సుందరమైనవేకాని ఖార్లే గుహాస్థంభములకును, ఎల్లోరా స్థంభములకును నివి తీసిపోవును. కాని గుహాలును, విహారములును మిక్కిలి విశాలములై యందముగా నున్న విహారములలో బౌద్ధభిక్షువులు విద్యార్థులు వాసము జేయువారు. చైతన్యముల ప్రార్థనామందిరముల స్థంభములపైన

గోడలమీద, గుహావితానముపై మనోహరములై యాశ్చర్య జనకములై వివిధవర్ణముల నత్యద్భుతములగు చిత్రలేఖనము లున్నవి.

ఒకటి, రెండు, పదునారు, పదునేడవ గుహాలుదక్క తక్కిన గుహాలలో కొన్నింటియందు చాల భాగమును, కొన్నిటియందు సంపూర్ణముగను చిత్రలేఖ్యములు రాలిపోయి నవి. కొన్ని గుహాంగణ మండపముల గొన్నికొన్ని చిత్రములు మాత్రము నిలిచియున్నవి.

క్రీస్తు పూర్వము ప్రథమ శతాబ్దము మొదలు క్రీస్తు తరువాత నారేడు శతాబ్దములవరకు నీ గుహాలు నిర్మించుచునే యున్నారు; గుహాలలో నా లేఖ్యముల చిత్రించుచునే యున్నారు. గుప్త వంశ సార్వభౌముని కాలమున అజంతా గుహాల వైభవము మహోత్కృష్టదశ నొందియున్నది. బౌద్ధ భిక్షువులు విజనమై ప్రకృతి కన్యా లీలావినోదసుందరమై వెలుగు నా ప్రదేశము నెట్లు కనుగొనిరో? ఒక జనపతి యొక గుహ దొలిపించి యిచ్చినాడు. యింకను భిక్షువులు రాదొడంగిరి. ఒక సంఘ మచ్చట నియమించినారు. మంత్రులు, కోటీశ్వరులగు వర్తక శ్రేష్ఠులు, ప్రభువులు రాజో ద్యోగులు యింక గుహాలు నిర్మించుచు దానములు చేయించు చుండిరి. గుహాలు రమ్యముగా చెక్కిరి. దేశ దేశముల నుండి చిత్రకారులబిలిపించి గోడలపై బౌద్ధ గాథలాది వివిధ విషయములు వ్రాయించిరి. అజంతా సంఘారామ మొక పరిషత్తైనది. నలంద, తక్షశిల అమరావతి పరిషత్తులకు తీసి పోని పవిత్ర క్షేత్రమైనది. సింహళము, దక్షిణదేశములు,

చీనా, జపాను సువర్ణదీవి యుత్తరదేశములు గాంధారము, యవనదేశము, బర్బరము మొదలగు విదేశములనుండి విద్యార్థులు, యాత్రికులు వేనవేలు వచ్చుచుండిరి. గుహాలు పెరిగి పోయెను.

కాలము మారినది. క్రొత్త మతములు విజృంభించినవి. అజంతా ఆ కొండలలోనే మరుగుపడిపోయినది.

౧౧

రాతిగోడపై వర్ణములతో బొమ్మలు వేయుట సాధ్యమేకాదు. కాని పూర్వ చిత్ర బ్రహ్మలు దానికై యొక మార్గము గనుగొనిరి. గోడను నొక్కులు నొక్కులుగ చెక్కించవలెను. దానిపై రేగడ మొదలగు కొన్ని మృత్తికలును, సన్నయిసుక, మంచి సున్నము, అతసీతుష భాద్యోషధులు గలిపి యొక లేపము జేసి యద్దానిని గోడకు పట్టించువారట. అది బాగుగ నారినవెనుక మరల దానిని తడపి తడియారుచుండగ వర్ణములతో చిత్రించువారు. వర్ణము లోషధులతో చేయబడినవే. కుంచెలు కొన్ని గడ్డిజాతులు, కొన్ని మృగపక్ష్యాది రోమములతోను చేసికొనిరి.

గుహాలలోనికి వెళ్ళుటతోడనే కంటికేమియు గాన్పింపదు. అంతయు చీకటి. నెమ్మదిగా కనుపాపలు చీకటి కలవాటుపడినతోడనే మన చుట్టును, మహారాజులు, సుందర స్త్రీరేఖలు చెలువారు వివిధభూషణాలంకృతులగు రాణులు, వారివారి పరిజనములతో సభామంటపముల, సింహాసనముల తోటలలో, చిత్రవిచిత్ర వర్ణములతో ప్రత్యక్షమయ్యెదరు. దేవతలు, ఎగిరిపోవు గంధర్వులు రాక్షసులు, కిన్నరులు,

యక్షులు, దివ్యలోకములకు గొనిపోదురు. పెద్దపులులు, సింహములు, తోడేళ్ళు, ఏనుగులు, తేళ్ళు, ఉద్యానవనములు, కమలాకరములు, పూవులతో కాయలతో నిండియున్న మామిడిచెట్లు, అరటి, ఖర్జూర, కొబ్బరి, మొదలగు వృక్షములు, పట్టణములు, పల్లెలు, వీథులు, హర్మ్యములు, గృహములు, పూరిగుడిసెలు, దేవాలయములు, విపణివీథులు, దుకాణములు, పాలవాండ్రు, సేవకులు, పాటకజనము, వేటకాండ్రు, సైనికులు అహా! పూర్వభారత ప్రపంచ మంతయు నొక్కసారి దృశ్యమైపోయినది.

బాగుగా పరికించి చూడవలెనన్న విద్యుద్దీపములు వెలిగించి చూడవలెను!! పూర్వకాలము వారెట్టు లీచిత్రముల లిఖించిరో!!!


కొన్నిచోట్ల బౌద్ధ జాతకగాథలు లిఖించినారు. ఒకటవ గుహలో నెట్టనెదట బోధిసత్త్వుడగు సిద్ధార్థుడు నలవు గలువ హస్తమున నలంకరించుకొని, ముత్యాల కిరీటము, భుజకీర్తులు, హస్తకంకణములు, యజ్ఞోపవతము, కంఠహారములు వెలిగి పోవ, రాజులు, రాణులు కానుకలర్పించుచుండ, పైన గంధర్వాది దివిజపరిజనము గానము సేయుచు కొలుచుచుండ నిలచియున్నారు. ఒకచో గజ జాతకమున్నది. ఒక గుహలో శిబిజాతకమున్నది. ఒకచోట మారుడు మహాబుద్ధుని, తథాగతుని, శాక్యమునిని తన మాయలకు లోబరచుకొన సుందరులగు తన కుమార్తెల నప్సరసల దిగంబరుల బంపి, యా తేజోమూర్తి యెదట నాట్యమాడించుచున్నాడు. మోహ, లోభ, క్రోధాది పరిజనములతో యుద్ధము సేయ సిద్ధమై

యున్నాడు. ఇంకొక్కచోట హంసజాతక గాధ చిత్రరూపముల లిఖింపబడినది.


౧.౨

అజంతా చిత్రకారులు మతసంబంధములగు విషయముల మాత్రమే యాకుడ్యములపై జిత్రింపలేదు. వారు రసికలు, రసజగత్తులో సదా తాండవమాడువారు. ఆత్మానందము, హృదయానందము, వారి నోల లాడించుచునే యున్నవి. బౌద్ధ పురాణగాధలకు సంబంధింపని యనేక ప్రపంచ విషయముల వారచ్చట లిఖించినారు. ఇరువురు పల్లెటూరి రయితు లొకచో ధాన్యపు ధరల మాట్లాడుచున్నారు. వేరొకచో నొక ముగ్ధ, వెండి యద్దములో కాటుక దిద్దుకొనుచున్నది. ఈ పూర్వ శిల్పులు సమస్త ప్రపంచము తీక్ష్ణదృక్కుల విలోకించి వాని రూప విన్యాసము హృదయస్థము గావించుకొని, భావనామార్గముల నీరూపము సౌందర్యాత్మైక్యమో యాయా ఫలితలలోననే కుంచెల దిప్పి లిఖించినారు. విషయమునకు దగినట్లు రేఖాస్వరూపమును మారినది. ఒకచో నమితమార్దవమై, సూచీముఖసదృశమై యుండును. ఒకచో కర్కశమై సాంద్రమైయుండును. ఎట్లయినను నా గీతలో పొంక మేమాత్రమును మరుగుపడి యుండదు. చిత్రములు నవరసము లొప్పారుచుండును. ఒకచో తన సర్వస్వము ధారవోయు శిబిచక్రవర్తి, ఒకచో హాస్యరస ముట్టిపడు మఱుగుజ్జువాడు.

వర్ణికాభంగములో నజంతాశిల్పు లద్భుతసామర్థ్యము వెల్లడించిరి. వారు ప్రయోగించిన ముఖ్యవర్ణములు నాల్గైదు



ఎల్లోరా-అజంతా లోని దృశ్యములు.



ఎల్లోరా-అజంతా లోని దృశ్యము.

మాత్రమున్నవి. అయినను వానివాని కలయికలచే పెక్కు వర్ణములు సృజించి యీ లేఖ్యముల లిఖించినారు. వారు ప్రకృతిని చంపక ప్రకృతి మార్గమున సౌందర్యపథములకు బోయిరి. గ్రీకు చిత్రకారులు రేఖాలాలిత్యమే ప్రధానమని ఎంచినారు. కాని యజంతా చిత్రబ్రహ్మలు, రేఖాలాలిత్యము, రూపవిశ్వాసము, రెంటిని నద్భుతముగ లీనమొందింప జేసినారు.

భారతీయ కళలలో ముఖ్య కళకు చెలికత్తియగా నలంకారశాస్త్రము విజృంభించినది. కొంచ మెచ్చుతగ్గు ముఖ్యకళకున్న ప్రాముఖ్యము దానికిని గలదు. చిత్రలేఖనమునం దలంకార విన్యాస మజంతాలోనే గమనించవలయును. ప్రతి చిత్రవిషయము చుట్టును "ఫ్రేమ్" వలె యలంకార కల్పనముండును. గుహ పైభాగము లంతట నీ యలంకార సృష్టియున్నది. అజంతాలోని యలంకారకల్పన కీదేశపు టలంకార కల్పనయు పోలనేపోలదు. అన్ని దేశములందును పూవులు దీయుట నలంకార కల్పనలుగా గైకొందురు. అజంతాలో పద్మోత్పల మందారాదిపుష్పములు, మల్లికా, మాధవీలతాగుల్మములు, చూత, సీతాఫల, నారికేళాదిఫలములు, గజవృషభ హరిణ సింహశార్దూలాది జంతువులు, బక, హంస, కీర, కేకి, జాలపాదాది పక్షిసంతతులును, సమస్తము; విచిత్ర చిత్ర మనోహరాద్భుత రూపముల నీ యలంకారకల్పనయం దిమిడిపోయినవి. హ్యూయెన్ భరతఖండమునకు యాత్రికుడై వచ్చినప్పు డజంతా సంఘారామ

మునకు అర్హాతాచార్యుడు ముఖ్యాచార్యుడని యీ యాత్రి కుడే నుడివియున్నాడు. ఆంధ్ర చిత్రకారులుగూడ నజంతాలో పనిచేసినట్లు సాక్ష్యములున్నవి. సింహళములో సింహగిరిపైన, ఉత్తర మాళవములో భాగ్ గుహాలలో, పాండ్యరాజ్యమున సితన్నవాసాల్ గుహాలలో, ఉత్తర మధ్యాసియా భాగముల కోట్చాహస్ టుర్ఫాన్‌టుఆన్ హాంగు గుహాలలో, యజంతా పద్ధతియే కుడ్యచిత్రరూపమున విరాజిల్లినది. అయ్యది యాయా దేశముల నాయారీతుల వృద్ధినంది, తార్తార, మొగలు దండయాత్రలతోబాటు మరల మన దేశమునకు వచ్చి యిచ్చటనున్న చిత్రలేఖనాపద్ధతిలో లీనమంది మొగలు రాజపుత్ర విన్యాసముల ప్రసిద్ధిగాంచి నేడు మరల పునర్జననమొందినది. చీనా, జపాను, టిబెట్టు, నేపాలు దేశము లలో విజృంభించిన చిత్రవైఖరి యజంతా మొగలు రాజ పుత్రమార్గముల నూతనాని నూతన వికాసము, నూతనశక్తి, దాల్చి వృద్ధిపొందుచున్నది.

౧౩

మూడురోజులైనది. ఆ సాయంతనము గుహాల మరల మరల దిలకించితిమి. దివాకరు డపరశైలము చేరబోవు సమయమున నొక్క ముహూర్తమునకు ముందు కొండొక్క దివ్యకిరణ మొక్కటి కుణచూత్రము చీకటిలోనున్న యీ గుహా బ్రవేశించి గుహా కుట్టిమమును దాకి కాంతివంతము జేసి, గుహాభ్యంతరమంతయు వెలిగించినది. అదృశ్య మర్ధోదయ పుణ్యకాలమును మించిపోయిన పవిత్రత కలది.

"ఓహో! కమలకారికా! ఆ పుష్పము లిటుదే" యను, మనోహర స్వనములు నా చెవులకు సోకినవి. వెఱగుపడి తల నటుతిప్పితిని. సుందరులగు కొందర రంగన లా గుహాలోనున్న బౌద్ధదేవునకు పుష్పఫలతోయము లర్పించి యారతులెత్తుచుండిరి. కాషాయాంబర మొక్కటి శాల్చి వేరొక యంబరము వలె వాటుగా వేసికొని వృద్ధుడగు నొక బౌద్ధభిక్షువు గణగణ గంట వాయించుచు "సూత్ర" మొకటి పఠియించును. నా కానుకల తథాగతునకు నివేదించుచుండెను. ఆశ్చర్యపడి "ఏమి" యని నన్ను నేను చూచుకొంటిని. నేనును కాషాయాంబరములు దాల్చియుంటినిగాని, నామెడలో నొక బంగారు గొలుసున్నది. నా హస్తమున కంకణములున్నవి. నా చేతిలో తృణతూలిక యొకటియున్నది. ఉంగరములు తిరిగిన నా జుట్టు వీపున బడిపోవ నెత్తిపై నొక ముడి ధరించి యుంటిని.

ఇంతవరకు నేనెవరినో నాకేమియు జ్ఞప్తికి రాలేదు. ఒక్కసారిగా ధాన్యకటకపురి నివాసుడనగు నొక చిత్రకారుని పుత్రుడననియు, మా తండ్రి నన్ను చిత్రలేఖనము నేర్చుకొన నజంతా పంపెననియు దెలిసికొంటిని. నా ప్రక్కవాలు గన్నుల సువర్ణదీవివాసుడగు బాలకుడొక్కడు "రా, ఆ బాలిక నీవంకచూడదులే" యని నన్ను బలవంతమున మాయాచార్యునికడకు గొనిపోవుచుండెను. మేము గుహాల మధ్యనున్న గుప్తమహారాజు మంత్రి నిర్మింపించు గుహాకడకు బోదలచి ముందుకు నడువ నారంభించితిమి. కాని నామనస్సు

హారతు లర్పించు నా వనితా సంఘుమధ్యమున నున్న యొక బాలికపైపోయి మరలిరాదు. నేను నడువలేకపోతిని.

సువర్ణదీవి బాలకుడు:- ఆ బాలిక నీ వైపుచూడదు.

నేను:- ఆబాలిక జవజవలాడు హంసకంఠముసుమా!

సువ:- చూడు మామె తల్లిప్రక్క నిలువబడి మూర్తికి నెట్లు నమస్కరించుచున్నదో! నీవైపు చూడనే చూడదేమి?

నేను:- ఆమె వెలిగిపోవు సుషమారేఖ సుమా!

సువ:- రా! నీవైపు చూడదులే.

అంత నా స్నేహితుని వదలించుకొని త్వరితముగా గర్భగుహాలోనికి పోయితిని. పదునారేండ్ల జవ్వని నా వైపు చూచి చిరునగవు మోము నలంకరింప "ఈయన రచించు చిత్రములు చూచినావా అమ్మా"యని తల్లిని ప్రశ్నించినది. "రేపు కనుగొంద"మని యా ఘుమ యుత్తరువిచ్చెను. తన్మయుడనై గుండె తటతట గొట్టుకొన మేము చిత్రించు గుహకు నా మిత్రుని కలసికొనిపోయితిని.

మరునాడా మంత్రిపుంగవుని యిల్లాలును, కుమారియు మా గుహకు చిత్రముల దిలకింపవిచ్చేసిరి. నే నుదయము మొదలావేశపూరితుడనై నామూర్తినంతయు నిండిపోయిన యొక్క భావమును చిత్రించితిని. మాగురువు "అహో"యని మెచ్చుకొన్నారు." "ఏమి,నీవు లిఖించినది మా బాలికనా?"

యని యా యమ నన్ను ప్రశ్నించినది. ఉత్తరు వీయలేక నేను వణకిపోతిని. సౌందర్యనిధియగు నా బాలిక, విగ్రహ మూర్తియగు తథాగతునకు పుష్పములు పళ్లెరముతో నివేదించుచున్నటుల నేను చిత్రించిన తన చిత్రమును గనుగొనుచు మందహాస లోచనాంచనముల నన్ను జూచి సిగ్గుపొందినది.

"సంధ్యాకాలమైనది మనము వెళ్ళవలె"నను మా యాత్రికుల మాటలు విని నేను మెలకువ గాంచితిని.

శ్రీ వెల్దుర్తి మాణిక్యరావుగారు రచించిన

అఖిల భారత అతిమిత్ర మహాసభ

౧-౦-౦

టప్పా ఖానాలు.

౧-౨-౦

త్వరలో వెలువడనున్నవి.

కొండా శంకరయ్యగారి ప్రిమియర్ ముద్రాక్షరశాల, సికిందాబాద్.

సోదర గ్రంథమాలలు

వైదిక ధర్మ గ్రంథమండలి

౫౦౧, దేవిడీను బాగు, హైద్రాబాదు దక్కన్.

౧. వేదమే ఈశ్వరీయజ్ఞానము. ౩. ఆర్యసమాజమన నేమి.
౨. పంచమహాయజ్ఞవిధి. ౪. వైదిక సంధ్యారహస్యము.

సంవత్సరము చందా ౧-౪-౦ పోస్టేజితో సహా.

ఆంధ్రకేసరి గ్రథమాల

౧౭౪, సుల్తానుబజారు, హైద్రాబాదు దక్కన్.

౧. కమ్మ తెమ్మెరలు. ౨-౩. రెండో ప్రంచయుద్ధమా? (రెండు భాగములు.)

సంవత్సరం చందా ౧-౪-౦ పోస్టేజితో సహా.

దేశోద్ధారక గ్రంథమాల

ఇమాంబావివీధి, సికింద్రాబాదు.

౧౦ పుస్తకములు వెలువడినవి.

సంవత్సరం చందా ౧-౭-౦ పోస్టేజితో సహా.

ప్రత్యూష ప్రచురణములు. సాధనసమితి కార్యాలయము.

68 బి. బన్సిలాల్ పేట, సికింద్రాబాదు.

౧. అంజలి. ౩. పరీక్ష చదువు.
౨. ప్రేంచందు అనువాదాలు. ౪. నిర్మాణం.

ప్రతి పుస్తకము ౦-౪-౦ పోస్టేజి ప్రత్యేకము.

ఆ యు ర్వే ద క ళ.

మన నిజాంరాష్ట్రమున ఆయుర్వేదమును ప్రచారముచేయు ఏకైక తెనుగు మాసపత్రిక. ప్రతివైద్యుడు చదువదగినది.

వివరములకు :— మ్యానేజరు:—
ఆయుర్వేద కళ. ౧౯౦, సుల్తాన్ బజారు, హైద్రాబాదు-ద.

వార్షిక మూల్యము రూ. 3-౦-౦

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	TPLA131B114
పుస్తకం పేరు	ఎల్లోరా అజంతా
తారీఖు	30/10/24
ముందు అట్ట	NO
వెనక అట్ట	NO
మొత్తం పేజీలు	39
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	NO
	NO
తయారు చేసినది	APSar
పేజీలు విడదీసినది	Thasin
	[illegible]
పరీక్ష చేసినది	HASEEMA
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good